సాక్షి నిర్మల్

శనివారం, 3, మే, 2025



కలియదున్నితే భూసారం

వరి కొయ్యలను కాల్చితే కాలుష్యం వెలువడుతుందని, కలియదున్నితే భూసారం పెరుగుతుందని వ్యవసాయాధికారులు రైతులకు సూచిస్తున్నారు. 10లో▸



నాలుగు నెలలకే అధ్వానం..

సారంగపూర్ మండలం జామ్ గ్రామంలో సీసీ రోడ్ల నాణ్యత నాలుగు నెలలకే తేలిపోయింది. కంకర తేలి నడవడం కూడా కష్టంగా మారింది. 11లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 40.4 /27.7

వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం వేడి అధికంగా ఉంటుంది. రాత్రి వరకు ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

జిల్లాలో 30 పోలీస్ యాక్ట్

నిర్మల్‌టౌన్: జిల్లాలో శాంతి భద్రతల కోసం ఈ నెల 1 నుంచి 31 వరకు 30 పోలీస్ యాక్ట్ 1861 అమలులో ఉంటుందని ఎస్పీ జానకీషర్మిల తెలిపారు. అనుమతి లేకుండా పబ్లిక్ మీటింగ్‌లు, ఊరేగింపులు ధర్నాలు చేయవద్దని పేర్కొన్నారు. నిషేధిత ఆయుధాలు, తుపాకులు, పేలుడు పదార్థాలు వాడరాదన్నారు. డీజేలు, లౌడ్ స్పీకర్ వంటివి పెట్టరాదని సూచించారు. ఏదైనా అత్యవసరం అయితే సబ్ డివిజనల్ పోలీస్ అధికారి లేదా ఉన్నత పోలీస్ అధికారుల నుంచి అనుమతి తీసుకోవాలని తెలిపారు. ఎవరైనా ఈ సమయంలో నియమాలు ఉల్లంఘిస్తే 30 పోలీస్ యాక్ట్ కింద చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సేంద్రియ ఎరువులపై అవగాహన



భూసార పరీక్షల్లో డీఏవో అంజిప్రసాద్

సోన్: పసుపు, మొక్క జొన్న పంటలో సేంద్రియ ఎరువుల వినియోగం, సుస్థిర వ్యవసాయ విధానాలపై మండలంలోని పాక్‌పట్లలో జిల్లా వ్యవసాయాధికారి అంజి ప్రసాద్ శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. భూసార పరీక్షలు విధిగా చేసుకుని సిఫార్సు చేసిన రసాయన ఎరువులే వాడాలని సూచించారు. సేంద్రియ ఎరువుల వినియోగం పెంచి నాణ్యమైన పంట దిగుబడి సాధించాలని పేర్కొన్నారు. గ్రామాల్లోకి సేంద్రియ ఎరువుల పేరుతో కొన్ని కంపెనీలు రైతులకు అంటగట్టే ప్రయత్నం చేస్తున్నాయని తెలిపారు. వాటిపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు విద్యాసాగర్, మండల వ్యవసాయాధికారి వినోద్‌కుమార్ పాల్గొన్నారు. అనంతరం భూసార పరీక్ష నిర్వాహకురాలు షహనాజ్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో కేవలం 5 నిమిషాల్లో భూసార పరీక్ష చేశారు.

రెవెన్యూ సదస్సులు నిర్వహించాలి

- రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి 'పొంగులేటి'



వీసీలో పాల్గొన్న జిల్లా అధికారులు

నిర్మల్‌చైన్‌గేట్: భూభారతి చట్టం అమలులో భాగంగా మే 5 నుంచి 20 వరకు ప్రతీ మండలంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, సీసీఎల్‌ఏ కమిషనర్ నవీన్‌మిట్టల్‌తో కలిసి కలెక్టర్లతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హైదరాబాద్ (ఎంసీఆర్ హెచ్ఆర్డీ) నుంచి కలెక్టర్ అభిలాష అభినవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పైలట్ ప్రాజెక్టు కింద చేపట్టిన నాలుగు మండలాల్లో ఇప్పటి వరకు 12,759 దరఖాస్తులు వచ్చాయని, రాష్ట్ర వ్యాప్తంగా రాబోయే సదస్సుల్లో సుమారు 15 లక్షల దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రతీ దరఖాస్తును మే నెలాఖరులోపు పూర్తిగా పరిశీలించి, జూన్ 2 నాటికి పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ భూముల్లో పొజిషన్ ఉన్న నిరుపేదలకు పట్టాలు ఇచ్చేందుకు ముఖ్యమంత్రితో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై దృష్టి..

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, మంజూరైన 51 వేల ఇళ్లలో 10 వేల ఇంటి నిర్మాణాలు మాత్రమే మొదలయ్యాయని, మే 10 నాటికి ఇంటి నిర్మాణాలు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలన్నారు. అర్హుల జాబితా ప్రకటించి పనులు వేగవంతం చేయాలన్నారు. నిర్మాణ పురోగతిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. భూ సేకరణ కింద ప్రభుత్వ భూముల వివరాలను రెవెన్యూ రికార్డుల్లో అప్‌డేట్ చేయాలని, భూసర్వే, ఆర్ఎస్ఆర్ ఎక్సెస్ సమస్యలను పరిష్కరించాల్సి ఉందన్నారు. అసైన్డ్ భూముల విక్రయాలపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

నీట్‌కు ఏర్పాట్లు..

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు మాట్లాడుతూ అధికారుల సమయాన్ని సమర్థంగా వినియోగించుకోవాలన్నారు. మే 4న జరిగే నీట్ ప్రవేశ పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు చేయాలన్నారు. మధ్యాహ్నం 1:30 గంటల తర్వాత గేట్లు మూసి, ప్రతీ అభ్యర్థిని క్షుణ్ణంగా తని ఖీ చేసి లోనికి అనుమతించాలన్నారు. గతంలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల సమాచారం మీడియా ద్వారా అభ్యర్థులకు తెలియజేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్‌కుమార్, ఆర్డీవోలు రత్నకళ్యాణి, కోమల్‌రెడ్డి, హౌసింగ్ పీడీ రాజేశ్వర్, ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్ సుదర్శన్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఈత నేర్చుకునేదెలా?

- జిల్లాలో అందుబాటులో లేని స్విమ్మింగ్ పూల్స్
- విధిలేక చెరువులు, కాలువలు, బావుల వద్దకు యువత
- ప్రమాదకరంగా ఈత నేర్చుకుంటున్న వైనం..
- ప్రైవేటులో ఉన్నా.. పరిశుభ్రత కరువు



స్విమ్మింగ్‌పూల్స్ లేకపోవడంతో నిర్మల్‌లోని ఖజానా చెరువులో ఈత నేర్చుకుంటున్న చిన్నారులు

నిర్మల్: ఈత.. అంటే చిన్న నుంచి పెద్దదాకా అందరికీ సరదా. అందులో వేసవిలో ఈత కొట్టడమంటే అందరూ ఎగిరి గంతేస్తారు. కానీ.. జిల్లావాసుల ఆ సరదా తీరడం లేదు. ఏళ్లు గడిచిపోతున్నా.. పాలకులు, అధికారులు ఒక్క స్విమ్మింగ్‌పూల్ కూడా కట్టించలేకపోయారు. దీంతో సరదా కోసం, ప్రత్యేకంగా ఈత నేర్చుకోవడానికి చెరువులు, కుంటలు, బావులను ఆశ్రయిస్తున్నారు. ఇలా.. ఈతకు వెళ్లి పలువురు చిన్నారులు మృత్యువాత పడ్డ ఘటనలూ ఉన్నాయి. చెరువుల్లో అపరిశుభ్రతతో చర్మవ్యాధుల బారినా పడుతున్నారు.

కొలనులు లేక చెరువుల్లోకి..

నిర్మల్ జిల్లాగా ఏర్పడి తొమ్మిదేళ్లవుతున్నా.. ఇప్పటికీ ఒక్క క్రీడాభివృద్ధి సక్రమంగా లేదు. కనీసం ఒక్కటంటే ఒక్క మైదానమూ దిక్కులేదు. జిల్లాలో ఎన్నో ఏళ్లుగా ఈతకొలను నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. కానీ.. పాలకులు, అధికారులు ఏమాత్రం దృష్టిపెట్టడం లేదు. గతంలో జిల్లాకేంద్రంలోని ఎన్టీఆర్ మినీస్టేడియంలో ఓ మూలన స్విమ్మింగ్‌పూల్ నిర్మిస్తామని చెప్పినా.. ఇప్పటికీ స్టేడియం నిర్మాణమే ఇంకా పూర్తి కాలేదు. ఇక ఈత కొలను హామీ.. హామీగానే మిగిలిపోయింది. చేసేది లేక.. చిన్నారులు, పెద్దలు నిర్మల్ చుట్టూ ఉన్న గొలుసుకట్టు చెరువులను ఆశ్రయిస్తున్నారు.

ప్రాణాలు పోతున్నాయి..

సరదాగా ఈత నేర్చుకుందామని వెళ్లి జిల్లాలోనూ చాలామంది విద్యార్థులు, యువకులు ప్రాణాలు కోల్పోయారు. ఇటీవల జిల్లా కేంద్రంలోనూ ఓ ఇంటర్ విద్యార్థి సరస్వతి కెనాల్‌లో ఈతకు వెళ్లి అందులోనే కొట్టుకుపోయాడు. చెరువులు, వాగుల్లో లోతు తెలియకుండా నీళ్లలోకి దిగడం, సరిగా ఈత రాకపోవడంతో మృత్యువాత పడుతున్నారు. చాలా చెరువుల్లో ఇష్టారీతిన పూడిక తీయడంతో వర్షాకాలంలో ఆ గుంతలు నిండిపోయి. లోతు అంచనా వేయలేకపోతున్నారు. ప్రమాదకరమని తెలిసినా.. కొందరు కెనాల్స్‌లో ఈతకు వెళ్తున్నారు. నీటి వేగాన్ని అంచనా వేయలేక మృత్యువాత పడుతున్నారు.

ప్రైవేటు కొలనులు ఉన్నా..

జిల్లాకేంద్రంతోపాటు భైంసాలో రెండు ప్రైవేట్ స్విమ్మింగ్ పూల్స్ ఉన్నాయి. కానీ ఈ వేసవిలో చాలామంది రావడం, సరైన పరిశుభ్రత చర్యలు పాటించకపోవడంతో అందులో ఈతకు వెళ్లినవారు చర్మవ్యాధులబారిన పడుతున్నారు. వేసవిలో ఫీజులూ భారీగానే ఉండటంతో చాలామంది తమ పిల్లలకు నేర్పించడానికి వెనుకంజ వేస్తున్నారు. ఆదిలాబాద్, నిజామాబాద్‌లలో జిల్లా క్రీడలశాఖ నుంచి అన్ని సౌకర్యాలతో స్విమ్మింగ్ పూల్స్ ఉన్నాయి. వీటిలో ప్రతీ వేసవిలో పిల్లలు ఈత నేర్చుకుంటున్నారు.

స్విమ్మింగ్ పూల్ ఉంటే..

ప్రభుత్వం క్రీడాసాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో కనీసం నిర్మల్, భైంసా, ఖానాపూర్ మూడు మున్సిపాలిటీల్లోనైనా స్విమ్మింగ్ పూల్స్‌ను నిర్మించాల్సిన అవసరముంది. ప్రభుత్వ ఈత కొలను ఉంటే ప్రత్యేకంగా స్విమ్మింగ్ నేర్పించేందుకు కోచ్‌లు ఉంటారు. ఆయన సంరక్షణలో చిన్నారులు ఈతను నేర్చుకుంటారు. కొలను కూడా వయసు, ఎత్తులకు తగ్గట్లుగా చిన్న నుంచి పెద్ద వరకు అందరూ ఈత నేర్చుకునేలా నిర్మిస్తారు. దీంతో ప్రాణాపాయం జరిగే అవకాశం ఉండదు. కొలనులోని నీటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తారు. చర్మవ్యాధులు సోకే అవకాశం ఉండదు. ఇక నిర్మల్ వంటి చెరువులు, నదులు, వాగులు, జలాశయాలు ఎక్కువగా ఉండటంతోపాటు తరచూ వరదలు, ముంపు ఉండే ప్రాంతాల్లో పెద్దలు, పిల్లలు ఈత నేర్చుకోవడం తప్పనిసరి. ఈ దిశగానైనా పాలకులు, అధికారులు స్విమ్మింగ్ పూల్స్ నిర్మాణంపై దృష్టిపెట్టాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

చెరువుల్లో నేర్పిస్తున్నాం..



స్థానికంగా సరైన స్విమ్మింగ్ పూల్ లేకపోవడంతో పిల్లలను స్థానిక ఖజానా చెరువులోకి తీసుకెళ్లి ఈత నేర్పిస్తున్నాం. పరిశుభ్రమైన స్విమ్మింగ్‌పూల్ ఉంటే పిల్లలకూ ఎలాంటి ఇబ్బంది లేకుండా ఈత నేర్చుకునే అవకాశం ఉంటుంది.

-కె.శ్రీకాంత్, నిర్మల్

ఈతకొలను ఏర్పాటు చేయాలి..



జిల్లా కేంద్రంలో స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు చాలా అవసరం. అందుబాటులో లేకపోవడంతో చాలామంది చెరువుల్లో ఈత నేర్చుకోవాల్సి వస్తోంది. ఆదిలాబాద్, నిజామాబాద్‌లో ఉన్నట్లు నిర్మల్‌లోనూ ఈతకొలను ఏర్పాటు చేయాలి.

– డి.వేణుగోపాల్, నిర్మల్

స్థలం లేకపోవడంతో..



జిల్లాకేంద్రంలో స్విమ్మింగ్ పూల్ నిర్మాణానికి సంబంధించి ప్రతిపాదనలు ఉన్నాయి. స్థానిక ఎన్టీఆర్ మినీస్టేడియంలో సరిపడా స్థలం లేకపోవడం ఇబ్బందిగా మారుతోంది. స్థలాభావం కారణంగానే నిర్మాణం పెండింగ్‌లో ఉంది.

– శ్రీకాంత్‌రెడ్డి, డీవైఎస్‌వో, నిర్మల్

జోరుగా నీళ్ల దందా..!

- పుట్టగొడుగుల్లా వెలుస్తున్న వాటర్ ప్లాంట్లు
- రోజుకు లక్షల రూపాయల వ్యాపారం
- నిబంధనలు పాటించని నిర్వాహకులు
- తుప్పు పట్టిన యంత్రాలు
- ఏళ్ల తరబడి వాడుతున్న క్యాన్లు
- ప్రజల ఆరోగ్యంతో చెలగాటం



నిర్మల్‌లో అపరిశుభ్రంగా ఓ మినరల్ వాటర్ ప్లాంటుకు చెందిన క్యాన్లు

నిర్మల్ టౌన్: జిల్లాలో మినరల్ వాటర్ దందా జోరుగా సాగుతోంది. ప్రభుత్వ అనుమతులు లేకుండా ప్లాంట్లు నడుస్తున్నాయి. మున్సిపాలిటీలు, మండల కేంద్రాల్లో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటైన ఈ ప్లాంట్లు ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెడుతూ రూ.లక్షల్లో ఆదాయం గడిస్తున్నాయి. తుప్పుపట్టిన యంత్రాలు, నాచు పట్టిన ట్యాంకులు, ఏళ్ల తరబడి వాడిన క్యాన్లతో నీటిని సరఫరా చేస్తున్నారు. దీంతో మినరల్ వాటర్ కొనుగోలు చేసే ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు.

నిబంధనలకు తిలోదకాలు

వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ(WHO) ప్రమాణాలు, బీఎస్ఐ అనుమతులతోపాటు పరిశ్రమలు, ఫుడ్ సెక్యూరిటీ, విద్యుత్, మున్సిపల్ శాఖల నుంచి ఆరు అనుమతులు తప్పనిసరి. నీటిని శుద్ధి చేసే మెంబ్రేన్లు, ఫ్రీజర్ ఫిల్లర్లతో మలినాలు, బ్యాక్టీరియా లేకుండా చూడాలి. ఫ్లోరైడ్ 1.0 మి.గ్రా. కంటే తక్కువగా ఉండాలి. అయితే, జిల్లాలో ఒక్క ప్లాంట్‌కు కూడా అనుమతి లేదు. ఇక నిబంధనలపై నిర్వాహకులకు కనీస అవగాహన లేదు. వాళ్లు అమ్మినవే మంచినీళ్లు అని నిత్యం లీటర్ల కొద్దీ తాగేస్తున్నారు. హైకోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ అధికారులు చర్యలు తీసుకోవడం లేదు.

కోట్లలో వ్యాపారం

వేసవిలో జిల్లాలో లక్షల లీటర్ల నీరు వినియోగమవుతోంది. మిషన్ భగీరథ నీరు సరిపోక, ప్రజలు మినరల్ వాటర్‌పై ఆధారపడుతున్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో 42 వార్డులు ఉండగా, ఒక్కో వార్డుకు 2 నుంచి 5 ప్లాంట్లు ఉన్నాయి. 20 లీటర్ల క్యాన్ ధర రూ.10–40 మధ్య ఉంటుంది. ప్యాకెట్లలో నీరు 5–6 గంటలకు మించి నిల్వ చేస్తే ప్రమాదకరమని తెలిసినా, రెండు–మూడు రోజులపాటు నిల్వ చేసి అమ్ముతున్నారు.

అధికారుల నిర్లక్ష్యం

అనుమతులు లేని ప్లాంట్లపై అధికారులు కన్నెత్తి చూడటం లేదు. తనిఖీలు చేయాల్సిన శాఖలు నిశ్శబ్దంగా ఉంటున్నాయి. దీంతో గొంతు నొప్పి, కలరా వంటి వ్యాధుల ప్రమాదం పొంచి ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ప్రజలు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అనుమతులు తప్పనిసరి...



మినరల్ వాటర్ ప్లాంట్ల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. జిల్లా కేంద్రంలో నగర మున్సిపల్ కమిషనర్ ద్వారా అనుమతులు తీసుకుని వాటర్ ప్లాంటు ఏర్పాటు చేయాలి. బీఎస్ఐ మార్క్ కచ్చితంగా ఉండాలి. అనుమతులు లేని వాటర్ ప్లాంట్‌లపై చర్యలు తీసుకుంటాం.

– జగదీశ్వర్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్, నిర్మల్

ఆర్వో వాటర్‌పై అధికారులు శ్రద్ధ వహించాలి..

ప్రతి ఇంట్లో ఆర్వో వాటర్ క్యాన్లు వేయించుకుంటున్నారు. వేసవిలో మరీ ఎక్కువవుతుంది. కాబట్టి అధికారులు ఆర్వో ప్లాంట్లను తనిఖీలు నిర్వహించి, అనుమతి ఇవ్వాలి. నీటిలో ఫ్లోరైడ్ శాతం 1.0. మిల్లి గ్రాములు ఉండేలా చూసుకోవాలి. లేదంటే చిన్న పిల్లలకు ,పెద్దలకు ఆ నీరు తాగడం వల్ల ఆరోగ్యం దెబ్బతినే అవకాశం ఉంది. ఆర్వో వాటర్ కన్నా మున్సిపల్ వాటర్ బాగుంటుంది.

– డాక్టర్ నాలం శశికాంత్, జనరల్ సర్జన్

ఆరిన ఆశాదీపాలు..

- నాన్న చూపునకూ నోచుకోకుండానే..!
- అక్కాచెల్లెళ్లను బలిగొన్న రోడ్డు ప్రమాదం
- దుబాయిలో ఉపాధిలేక తండ్రి అవస్థలు..
- స్వదేశానికి వచ్చేందుకూ డబ్బులు లేని దుస్థితి
- భర్త కోసం కూలీడబ్బులు పంపిస్తున్న భార్య



తండాలో విలపిస్తున్న కుటుంబసభ్యులు



అశ్విని(ఫైల్)



మంజుల (ఫైల్)

నిర్మల్/పెంబి: 'నాన్న.. నువ్వేం ఫికర్ చేయకు. ఇటేం మనసు పెట్టుకోకు. అమ్మా మేము మంచిగనే ఉన్నం. మంచిగ చదువుకుంటున్నం. నువ్వు జాగ్రత్తగా ఉండు. తొందరలనే మనకు మంచి రోజులు వస్తయ్..' అంటూ నిత్యం తమ తండ్రి మనసులో ఆశలు వెలిగించే ఆ 'దీపాలు' అవి నెరవేరకముందే అర్ధంతరంగా ఆరిపోయాయి. తన బిడ్డల చివరిచూపు కోసం ఆ తండ్రి దేశంకాని దేశంలో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నాడు. రెక్కల కష్టంతో పెంచుకున్న బిడ్డలిద్దరూ అసువులు బాయడంతో ఆ తల్లి గుండె చెరువైంది. నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండలం అర్గుల్ సమీపంలో ఎన్‌హెచ్ 44పై శుక్రవారం జరిగిన రోడ్డుప్రమాదంలో నిర్మల్ జిల్లా పెంబి మండలం లోతొర్యతండాకు చెందిన అక్కాచెల్లెళ్లు అశ్విని(21), మంజుల(17) మృతిచెందారు.

మారుమూల తండా నుంచి..

గ్రామస్తులు, జక్రాన్‌పల్లి ఎస్సై ఎండీ మాలిక్ రహమాన్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాలోని మారుమూల అటవీ ప్రాంతమైన పెంబి మండలం లోతొర్య తండాలో మట్టిగోడలతో రేకుల ఇంట్లో ఉంటున్న బానావత్ సుగుణ, రెడ్డి దంపతులకు ముగ్గురు కూతుళ్లు కుమార్తెలు అశ్విని, మంజుల, నిహారికలతోపాటు కుమారుడు ఆకాశ్ ఉన్నారు. అందరూ చదువుకుంటున్నారు. ఎకరం భూమి మాత్రమే ఉండటంతో రోజువారీ వ్యవసాయ కూలీలుగా పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. స్థానికంగా సరైన ఉపాధి లేకపోవడంతో మూడేళ్లక్రితం బానావత్ రెడ్డి దుబాయి వెళ్లాడు.

ఎలాగైనా చదవాలని..

తమకోసం తమ తల్లిదండ్రులు పడుతున్న కష్టాలను చూస్తూ పెరిగిన పిల్లలు బాగా చదివి మంచి ఉద్యోగాలు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. పెద్దకూతురు అశ్విని ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇటీవల ఫైనలియర్ పూర్తిచేసింది. రెండోకూతురు మంజుల ఇచ్చోడలోనే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తిచేసింది. మంజులకు ఈఏపీ ఎంట్రన్స్ టెస్ట్ ఉండటంతో అక్క అశ్విని సమీప బంధువు జాదవ్ హంసరాజుతో కలిసి గురువారం కారులో హైదరాబాద్ వెళ్లారు. అక్కడ పరీక్ష రాసి, శుక్రవారం తండాకు తిరిగి వస్తుండగా నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండలం అర్గుల్‌వద్ద కారు అదుపు తప్పి కల్వర్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో అక్కాచెల్లెళ్లు అక్కడే చనిపోగా, బంధువు జాదవ్ హంసరాజు కాలు, చేయి విరిగాయి. అతడిని ఆర్మూర్ ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకున్నామని ఎస్సై తెలిపారు.

చివరిచూపునకూ నోచుకోలేక..

మూడేళ్లక్రితం దుబాయి వెళ్లిన బాణావత్ రెడ్డి ఏడాదిపాటు ఓ కంపెనీలో పనిచేశాడు. ఆ ఏడాది పనిచేసినా కంపెనీ ఆయనకు డబ్బులు ఇవ్వలేదు. మోసపోయానని తెలుసుకున్న రెడ్డి బయటకు వచ్చి కలివెల్లి వీసాపై చిన్నచితకా పనులు చేసుకుంటున్నాడు. ఏడాదికాలంగా ఖర్చుల కోసం భార్య సుగుణనే ఇక్కడి నుంచి డబ్బులను పంపిస్తోంది. ప్రస్తుతం ఆయన స్వదేశానికి తిరిగి రావడానికీ డబ్బులు లేవు. తన కన్నబిడ్డలను చివరిచూపు కూడా చూడలేని దయనీయ పరిస్థితి. కనీసం విమాన చార్జీలకు డబ్బులు ఇస్తే.. తన బిడ్డల చివరిచూపైనా చూస్తానంటూ రెడ్డి విలపిస్తున్నాడు.

ఒక్కో యూనిట్‌కు నలుగురు పోటీ..

- రాజీవ్ యువ వికాసానికి 35,177 దరఖాస్తులు
- జిల్లాకు 8,684 యూనిట్ల కేటాయింపు
- జనాభా ప్రాతిపదికన మండలాలకు యూనిట్లు..
- క్షేత్రస్థాయి పరిశీలనకు ఏర్పాట్లు పూర్తి



సంయుక్త బ్యాంకర్ల సమావేశంలో పాల్గొన్న జిల్లా అధికారులు, బ్యాంకర్లు

నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి, సొంత వ్యాపార అవకాశాల కోసం రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రవేశపెట్టింది. జిల్లాలో 35,177 దరఖాస్తులు రాగా, జనాభా ప్రాతిపదికన జిల్లాకు ప్రభుత్వం 8,684 యూనిట్లు మంజూరు చేసింది. దీంతో ఒక్కో యూనిట్‌కు సగటున నలుగురు పోటీపడుతున్నారు. ఆర్థిక సాయం, రుణాలు, సబ్సిడీలు అందించే ఈ పథకానికి భారీ స్పందన లభించింది. ఏప్రిల్ 14న దరఖాస్తుల స్వీకరణ ముగియగా, రెండు రోజుల్లో క్షేత్రస్థాయి పరిశీలన ప్రారంభం కానుంది.

దరఖాస్తులు ఎక్కువ.. మంజూరు తక్కువ..

జిల్లాలో వర్గాల జనాభా ఆధారంగా యూనిట్లను కేటాయించారు. బీసీ అభివృద్ధి శాఖ ద్వారా 17,286 బీసీ, 504 ఎంబీసీ, 419 ఈబీసీ దరఖాస్తులకు 3,876 బీసీ, 842 ఈబీసీ యూనిట్లు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 7,350 దరఖాస్తులకు 2,894 యూనిట్లు. మైనారిటీ సంక్షేమ శాఖ ద్వారా 5,926 మైనారిటీ, 65 క్రిస్టియన్ దరఖాస్తులకు 1,045 మైనారిటీ, 27 క్రిస్టియన్ యూనిట్లు కేటాయించారు. మండలాల వారీగా బ్యాంకుల ద్వారా కేటాయింపు ప్రక్రియ జరుగుతోంది.

పరిశీలన, లబ్ధిదారుల ఎంపిక

దరఖాస్తుల పరిశీలనకు జిల్లాస్థాయిలో కలెక్టర్ చైర్మన్‌గా, డీఆర్డీఏ పీడీ కన్వీనర్‌గా, శాఖలు, బ్యాంక్ అధికారులు సభ్యులుగా కమిటీ ఏర్పాటైంది. మండల స్థాయిలో ఎంపీడీవో, మున్సిపల్ పరిధిలో కమిషనర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, నిరుద్యోగులకు ప్రాధాన్యత ఇస్తారు. పరిశీలన, లబ్ధిదారుల ఎంపిక ఈ నెల మధ్యలో పూర్తవుతుంది. జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా లబ్ధిదారులకు సెలక్షన్ పత్రాలు అందజేస్తారు.

ఒక రేషన్ కార్డుకు ఒకరికే..

ఈ పథకంలో ఒక రేషన్ కార్డుపై ఒకరికి మాత్రమే రాయితీ రుణం అందుతుంది. బహుళ దరఖాస్తులు వస్తే, కార్డు హోల్డర్‌తో సంప్రదించి ఒక దరఖాస్తును పరిగణిస్తారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియపై స్పష్టత కోసం అధికారులు నివేదికలను ప్రభుత్వానికి సమర్పించనున్నారు.

మండలాలు, మున్సిపాలిటీల వారీగా ఎస్సీ, బీసీ, మైనారిటీ కార్పొరేషన్లకు అందిన దరఖాస్తులు, టార్గెట్..

మండలం	ఎస్సీ	టార్గెట్	ముస్లిం	టార్గెట్	క్రిస్టియన్	టార్గెట్	బీసీ	టార్గెట్	ఈబీసీ	టార్గెట్
బాసర	194	103	115	31	0	0	372	126	30	24
భైంసా	638	205	252	60	4	1	1,198	251	30	43
దస్తురాబాద్	302	112	7	2	0	0	430	82	35	7
దిలావర్‌పూర్	191	94	163	25	0	0	499	98	35	39
కడెం	690	182	77	33	6	4	887	158	43	22
ఖానాపూర్	536	136	61	16	6	2	918	163	39	12
కుభీర్	431	189	100	41	7	0	1,194	256	40	22
కుంటాల	261	88	89	24	0	0	766	134	31	20
లక్ష్మణచాంద	280	148	76	19	3	2	659	189	58	31
లోకేశ్వరం	431	211	73	18	1	0	776	187	35	43
మామడ	238	109	116	22	8	0	463	141	38	31
ముధోల్	338	169	297	72	1	0	539	191	47	41
నర్సాపూర్(జి)	229	107	163	14	1	0	430	110	58	19
నిర్మల్ రూరల్	334	118	67	68	3	4	836	192	33	31
పెంబి	97	26	20	19	0	0	222	36	12	5
సారంగాపూర్	425	195	159	28	1	0	1,308	229	79	57
సోన్	204	108	71	35	4	2	678	153	44	43
తానూర్	375	193	94	42	1	0	739	256	16	19
మున్సిపాలిటీలలో..										
నిర్మల్	514	197	2,375	241	21	6	2,581	496	1,706	31
భైంసా	383	132	1,216	222	0	0	918	290	34	84
ఖానాపూర్	259	72	338	33	2	2	754	127	30	21

క్షేత్రస్థాయి సర్వే చేపడతాం



రాజీవ్ యువ వికాసానికి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ కొనసాగుతుంది. ఆయా మండలాల ఎంపీడీవోలకు లబ్ధిదారుల దరఖాస్తు ఫారంలు అందజేశాం. క్షేత్రస్థాయిలో సిబ్బంది సర్వే చేసి అర్హులైన వారిని ఎంపిక చేస్తారు.

– శ్రీనివాస్, బీసీ సంక్షేమ శాఖ అధికారి

క్లుప్తంగా

ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్‌కు రాజీనామా

మంచిర్యాలఅర్బన్: టీజీఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ ఆదిలాబాద్ రీజియన్ కార్యదర్శి పదవికి భీమేశ్వర్‌రావు శుక్రవారం రాజీనామా చేశారు. గతంలో కార్మికుల సమ్మె తర్వాత వారి అనేక సమస్యలపై యాజమాన్యం, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంలో యూనియన్ రాష్ట్ర నాయకత్వం విఫలమైందని ఆరోపించారు. సమస్యలపై నాయకత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో మనస్తాపం చెంది రాజీనామా చేసినట్లు తెలిపారు. రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శికి రాజీనామా లేఖను పంపినట్లు పేర్కొన్నారు.

బాసరలో భక్తుల రద్దీ



క్యూలైన్లో వేచి ఉన్న భక్తులు

బాసర: బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూలైన్‌లో బారులు తీరారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి తరలివచ్చారు. శుక్రవారం వేకువజామున పవిత్ర గోదావరి నదిలో పుణ్యస్నానాలు అనంతరం నది ఒడ్డున శివాలయంలో భక్తులు పూజలు చేశారు. అక్షరాభ్యాస మండపంలో తల్లిదండ్రులు చిన్నారులకు అక్షర శ్రీకారం, కుంకుమార్చన పూజలు చేయించారు. అనంతరం శ్రీ జ్ఞాన సరస్వతి, మహాంకాళి, మహాలక్ష్మి అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.

గోదావరికి హారతి



హారతి ఇస్తున్న వేద పండితులు

బాసర: బాసరలో గోదావరి నదికి శుక్రవారం హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీ వేద భారతి పీఠం, గ్రామస్తుల ఆధ్వర్యంలో గోదారమ్మ తల్లికి పూజలు చేశారు. వేద పాఠశాల విద్యార్థులు పంచ, నాగ హారతిని ఇచ్చారు. వేద విద్యానంద గిరిస్వామి, భక్తులు తదితరులు ఉన్నారు.

ఆటో దగ్ధం



దగ్ధమైన ఆటో

బాసర: బాసర ట్రిపుల్ ఐటీ వద్ద శుక్రవారం ఆటోలో మంటలు చెలరేగి దగ్ధమైంది. భైంసా పట్టణానికి వెళ్తున్న ఆటోలో ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించడంతో డ్రైవర్ తప్పించుకున్నాడు. ఆటోలో ప్రయాణికులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. అటుగా వెళ్తున్న కొందరు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటన స్థలానికి చేరుకున్నారు. ఎండ తీవ్రత వల్ల ప్రమాదం సంభవించి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

కెమెరాలో వన్యప్రాణులు

జన్నారం: వన్యప్రాణుల గణనలో భాగంగా ఇందన్‌పల్లి అటవీ రేంజ్ పరిధిలో ఇటీవల కెమెరాలు అమర్చారు. ఇందులో అనేక వన్యప్రాణులు కనిపించినట్లు రేంజ్ అధికారి కారం శ్రీనివాస్ తెలిపారు. వివిధ ప్రాంతాల్లో అమర్చిన కెమెరాలో అడవి దున్నలు, నీలుగాయిలు, చుక్కల దుప్పులు, నెమళ్లు చిక్కాయి. అత్యధికంగా చుక్కల దుప్పులు పిల్లలతో కనిపించినట్లు ఎఫ్ఆర్వో తెలిపారు.



తల్లితో చుక్కల దుప్పి పిల్ల



నెమలి



చుక్కల దుప్పి



అడవి దున్న

కలియదున్నితే భూసారం

- వరి కొయ్యలు కాల్చితే కాలుష్యం
- దిగుబడిపై ప్రభావం



ధర్మోరలో వరి కొయ్యలకు నిప్పుపెట్టడంతో కాలిన పైపులు

లోకేశ్వరం: వరి కోతలు పూర్తవుతున్నాయి. వానాకాలం సాగుకు రైతులు సమాయత్తమవుతున్నారు. పొలాన్ని దుక్కి దున్నడానికి అడ్డంగా ఉన్న వరి కొయ్యలను కాల్చడంలో నిమగ్నమయ్యారు. కొయ్యలు తగలబెడితే వెలువడే పొగతో వాతావరణ కాలుష్యంతోపాటు భూసారం దెబ్బతింటుంది. సూక్ష్మపోషకాలు నశిస్తాయి. పంట దిగుబడిపై ప్రభావం చూపుతుంది. భవిష్యత్తులో సేద్యం కష్టమవుతుంది. ఈ విపత్తును తప్పించడానికి రైతులంతా కొయ్యలను కలియదున్ని సేంద్రియ ఎరువుగా మార్చుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. వ్యవసాయ ఆధారితమైన జిల్లాలో యాసంగి సీజన్ పూర్తికానుంది. జిల్లాలో 1.20 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. రైతులు యంత్రాలతో కోతలు చేపట్టారు. పొలాల్లో వరి కొయ్యలతోపాటు పంట వ్యర్థాలు మిగిలిపోయాయి. వీటిని తొలగించి పొలాన్ని దుక్కి దున్నడానికి కొయ్యలను తగలబెడుతున్నారు. కలియదున్నాలంటే చాలా సమయం పడుతుందని, ఖర్చుతో కూడుకుందని భావిస్తున్నారు. ఒక్కసారి మంట అంటిస్తే గంటలో కాలిపోతుందనే ఆలోచనలో ఉన్నారు. ఈనేపథ్యంలో రైతులకు వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు.

ఉపయోగాలు..

- కలియ దున్నడంతో వరికొయ్యలు మట్టిలో కలిసిపోయి సేంద్రియ ఎరువుగా మారుతుంది.
- నత్రజని, భాస్వరం, సూక్ష్మపోషకాలు వృద్ధి చెందుతాయి.
- సేంద్రియ కర్బన్ శాతం పెరుగుతంది.
- భూసారం పెరిగితే యాసంగిలో వాడే ఎరువులను 30 నుంచి 40 శాతం తగ్గించుకోవచ్చు.
- వానపాములు పెరిగి భూమి సారవంతమవుతుంది.

ఇలా చేయాలి..

- పొలాన్ని రోటవేటర్‌తో కలియదున్నాలి. వరి కొయ్యలు చిన్నచిన్న ముక్కలుగా మారుతాయి.
- దుక్కికి నీళ్లు పెట్టి ఎకరాకు 100 గ్రాముల సింగిల్ సూపర్ పాస్ఫేట్ చేసి 15 నుంచి 20 రోజులు పొలాన్ని నానబెట్టాలి.
- కొయ్యలు పూర్తిగా కుళ్లిపోయి సేంద్రియ ఎరువుగా మారుతాయి.

నష్టాలు..

- వరికొయ్యలను కాలిస్తే భూసారం దెబ్బతింటుంది. తేమను కలిగి ఉండే మట్టి తన సహజగుణాన్ని కోల్పోతుంది.
- నేలలో సహజసిద్ధంగా ఉండే సూక్ష్మజీవులు, మిత్ర పురుగులు నశిస్తాయి.
- నత్రజనిలాంటి పోషక పదార్థాలు క్షీణిస్తాయి.
- కొన్నేళ్లుగా భూసారమంతా తగ్గిపోవడంతో సాగుకు పనికి రాకుండా పోతుంది.
- కాల్చడంతో వచ్చే దట్టమైన పొగతో రైతు ఆరోగ్యం దెబ్బతింటుంది.
- మంటలు పెద్దవైతే పక్కనే గల ఇతర పంటలు వస్తువులు కాలిపోతాయి.

కాల్చడం మానేశాను



గతంలో అవగాహన లేక వరికొయ్యలను కాల్చేవాళ్లం. వ్యవసాయాధికారుల సూచనతో మానేశాం. ఇప్పుడు దుక్కితో దున్నేసి సేంద్రియ ఎరువుగా మార్చుకుంటున్నాం. భూసారం పెరుగుతోంది. పంటకు అవసరమైన పోషకాలు దొరుకుతున్నాయి.

– మామిడి సునీల్‌రెడ్డి, ధర్మోర రైతు

అవగాహన కల్పిస్తున్నాం



వరి కొయ్యలు కాల్చవద్దని రైతులకు సూచిస్తున్నాం. దీని వల్ల కలిగే అనర్థాలను వివరిస్తున్నాం. అవగాహన ఉన్నవారు కలియదున్ని సేంద్రియ ఎరువుగా మార్చుకుంటున్నారు.

– అంజిప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి, నిర్మల్

డిగ్రీ ప్రవేశాలకు వేళాయె..

- నేటి నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం
- మూడు విడతల్లో ప్రవేశాలు

బోథ్: తెలంగాణలో డిగ్రీ ప్రవేశాలకు దోస్త్ నోటిఫికేషన్ విడుదలైంది. ఈమేరకు ఉన్నత విద్యామండలి శుక్రవారం వివరాలు వెల్లడించింది. ప్రవేశాల ప్రక్రియను మూడు విడతల్లో పూర్తి చేయనుంది. ఆన్‌లైన్ ద్వారా డిగ్రీ మొదటి సంవత్సరానికి సంబంధించిన సీట్లు భర్తీ చేయనుంది. శనివారం నుంచి విద్యార్థులు దోస్త్ వెబ్‌సైట్, మీసేవా, టీ యాప్ ద్వారా రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించింది. ఉమ్మడి ఆదిలాబాద్‌లో 91 డిగ్రీ కళాశాలలు ఉన్నాయి.

కళాశాలల్లో రిపోర్ట్ చేయాలి

ఫస్ట్ ఫేజ్‌లో సీట్లు పొందే విద్యార్థులు మే 30 నుంచి జూన్ 6లోపు కళాశాలల్లో రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. రెండు, మూడు విడతలో సీట్లు పొందే వారు ఆయా కళాశాలల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలి. అలా చేయకపోతే సీటు రద్దవుతుంది. ఫస్ట్ సెమిస్టర్ తరగతులు జూన్ 30 నుంచి ప్రారంభమవుతాయి.

రిజిస్ట్రేషన్లు ఇలా..

- ఇంటర్ పూర్తయిన విద్యార్థులు డిగ్రీలో ప్రవేశం కోసం దోస్త్ వెబ్‌సైట్‌లో www.dost.cgg.gov.in రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. కళాశాలలను ఎంచుకోవాలి. ఇంటర్‌లో వచ్చిన మార్కులు, రిజర్వేషన్ ఆధారంగా సీట్లు కేటాయిస్తారు. సీట్లు మిగిలితే స్పెషల్ ఫేజ్ నోటిఫికేషన్లు వస్తాయి. వీటిపై ఉన్నత విద్యా మండలి నిర్ణయం తీసుకుంటుంది.
- దోస్త్ వెబ్‌సైట్, మొబైల్ యాప్ ద్వారా డిగ్రీ అడ్మిషన్ల అప్‌డేట్స్ తెలుసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ల ఫీజుతోపాటు వెబ్ ఆప్షన్లు, సీట్ల కేటాయింపు, అలాట్‌మెంట్ కాపీలు పొందటం వంటి ప్రక్రియలు పూర్తి చేసుకోవచ్చు.

ప్రవేశాలు ఇలా..

- డిగ్రీలో మూడు విడతల ద్వారా ప్రవేశాలకు అవకాశం.
- మొదటి ఫేజ్‌లో భాగంగా నేటి నుంచి దోస్త్ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుంది. రూ.200 ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈనెల 21వ తేదీ తుది గడువు. ఈనెల 10 నుంచి 22 వరకు వెబ్ ఆప్షన్లు ఎంచుకోవచ్చు. 29న మొదటి ఫేజ్ సీట్ల కేటాయింపు ఉంటుంది.
- రెండోవిడత కింద ఈనెల 30 నుంచి జూన్ 8 వరకు రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. మే 30 నుంచి జూన్ 9 వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు. 13న సీట్ల కేటాయింపు ఉంటుంది.
- మూడో విడత ప్రక్రియ జూన్ 13 నుంచి షురూ అవుతుంది. జూన్ 19 తుది గడువుగా నిర్ణయించింది. జూన్ 13 నుంచి 19 వరకు వెబ్ ఆప్షన్లు, 23న సీట్ల కేటాయింపు ఉంటుంది.

ఉత్తీర్ణత సాధించేలా తరగతులు నిర్వహించాలి



అధ్యాపకులతో మాట్లాడుతున్న వెంకటేశ్వర్

ఇంద్రవెల్లి: ఇంటర్‌లో ఫెయిల్ అయిన విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఇంటర్ బోర్డు రాష్ట్ర పరిశీలకుడు వెంకటేశ్వర్ అన్నారు. మండలంలోని లింగూడలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలను శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధ్యాపకులతో సమావేశమయ్యారు. ఇంటర్‌లో ఫెయిల్ అయిన విద్యార్థుల వివరాలు, ప్రత్యేక తరగతుల నిర్వహణ, ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్ల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేలా అధ్యాపకులు ప్రణాళికలు తయారు చేయాలన్నారు. మే నెల పూర్తిగా అడ్మిషన్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. ఇంటర్ బోర్డు నిబంధనలపై నిర్లక్ష్యం చేస్తే శాఖ పరమైన చర్యలుంటాయని హెచ్చరించారు. ప్రిన్సిపాల్ మారుతి, అధ్యాపకులు మధుకర్, ప్రమీల, దళిత్ తదితరులు ఉన్నారు.

ఆర్టీఐ పేరిట డబ్బులు డిమాండ్

- ముగ్గురి అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: పాఠశాలపై ఆర్టీఐ వేసి డబ్బులు డిమాండ్ చేసిన ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం..పట్టణంలోని విద్యానగర్‌లో చాణక్య పాఠశాలకు సంబంధించి భుక్తాపూర్‌కు చెందిన ఎండీ అర్షద్, షేక్ సమద్, తాటిగూడకు చెందిన షేక్ యూసుఫ్‌లు ఆర్టీఐ వేశారు. పాఠశాల యజమాని, మైనార్టీ ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ అమీరొద్దీన్ ఆ ముగ్గురిని ఆర్టీఐ వివరాలు ఇస్తానని ఇటీవల పిలిచాడు. తమకు ఆర్టీఐ వివరాలు వద్దని, తాము (ఐయూఎంఎల్) ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ పార్టీ ఏర్పాటు చేశామని, పార్టీ ఫండ్ రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయన పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదుచేశారు. శుక్రవారం ఎండీ అర్షద్, షేక్ యూసుఫ్, షేక్ సమద్‌లను రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

జొన్నలేప తిని 20 ఆవులు మృతి



ఆవులకు చికిత్స అందిస్తున్న పశువైద్యాధికారి పర్వేజ్ అహ్మద్

బజార్‌హత్నూర్: మేతకు వెళ్లిన ఆవులు జొన్న లేప తిని మృత్యువాతపడ్డాయి. మండలంలోని బుర్కపల్లి గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. పశువైద్యాధికారి పర్వేజ్ అహ్మద్ కథనం ప్రకారం.. గ్రామంలో 45 ఆవులు శుక్రవారం పశుగ్రాసం మేయడానికి వెళ్లాయి. పంట చేనులో జొన్న లేప (కోత తర్వాత జొన్న కాండానికి మొలిచిన మొలకలు) తిని 20 ఆవులు మృతిచెందాయి. మిగతా ఆవులకు సకాలంలో వైద్య చికిత్స అందించడంతో ప్రాణాలతో బయటపడ్డాయి. విషయం తెలుసుకున్న ఎంఆర్ఐ నూర్‌సింగ్, ఏఎస్సై లింబాజీ ఘటనస్థలానికి చేరుకుని మృతిచెందిన ఆవులను పరిశీలించారు. కాగా బర్దవల్ నానక్‌సింగ్‌కు చెందిన 3 ఆవులు, టాక్ల నానక్‌సింగ్ 4, హరాషార్‌సింగ్ 2, కపూర్‌చంద్ 2, గులాబ్ సింగ్, గురువేసింగ్, చందర్‌సింగ్, న్యాల్‌సింగ్, సుభాష్, బాన్య రామ్, బామన్ పరుశురాం, హరిసింగ్, గోపిచంద్‌లకు చెందిన ఒక్కొక్క ఆవులు మృతి చెందాయి.

వేర్వేరు కారణాలతో ఇద్దరు ఆత్మహత్య

నిర్మల్, మంచిర్యాల జిల్లాలకు చెందిన ఇద్దరు వేర్వేరు కారణాలతో ఆత్మహత్యకు పాల్పడ్డారు. భార్య కాపురానికి రావడం లేదని భర్త ఉరేసుకున్నాడు. మద్యానికి బానిసైన యువకుడు ఆర్థిక ఇబ్బందులతో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు.


భార్య కాపురానికి రావడం లేదని..



రవికిరణ్ మృతదేహం

తానూరు: భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపంతో భర్త ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ట్రైయినీ ఎస్సై నవనీత్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని మహాలింగి గ్రామానికి చెందిన బన్సోడే రవికిరణ్ (34)కు ముథోల్ మండలం సరస్వతినగర్‌కు చెందిన జ్యోతితో ఏడేళ్ల క్రితం వివాహమైంది. ఇప్పటివరకు సంతానం కలగడం లేదని బాధతో రవికిరణ్ మద్యానికి బానిసయ్యాడు. భార్యభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో గతేడాది జ్యోతి సరస్వతినగర్‌కు వెళ్లింది. అప్పటి నుంచి తండ్రి సుభాష్‌తో రవికిరణ్ ఉంటున్నాడు. ఈ క్రమంలో భార్య కాపురానికి రాకపోవడం, ఒంటరి జీవితం భరించలేక తీవ్ర మనస్తాపంతో గురువారం రాత్రి ఇంట్లో ఉరేసుకున్నాడు. శుక్రవారం ఉదయం తండ్రి గమనించి పోలీసులకు సమాచారం అందించాడు. ట్రెయినీ ఎస్సై ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. తండ్రి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మద్యానికి బానిసై యువకుడు..



దుర్గాప్రసాద్ మృతదేహం

మంచిర్యాలక్రైం: మంచిర్యాల, రవీంద్రఖని రైల్వే స్టేషన్ల మధ్య గుర్తు తెలియని రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. జీఆర్పీ ఎస్సై మహేందర్ కథనం ప్రకారం.. తీగల్‌పహాడ్‌కు చెందిన పైడి దుర్గా ప్రసాద్ (28) మద్యానికి బానిసయ్యాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా మనస్తాపం చెందాడు. జీవితంపై విరక్తితో శుక్రవారం ఉదయం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి శంకరమ్మ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ ఎస్సై తెలిపారు.

గల్ఫ్ కార్మికుడి ఆచూకీ కోసం వినతి



ప్రవాసీ ప్రజావాణిలో వినతిపత్రం ఇస్తున్న కుటుంబీకులు, నాయకులు

ఖానాపూర్: మండలంలోని గోడలపంపు గ్రామానికి చెందిన సింగం రాజేశ్వర్ ఉపాధి నిమిత్తం ఆరేళ్ల క్రితం సౌదీ అరేబియాకు వెళ్లాడు. అక్కడ పనిచేస్తున్న ఆయన రెండేళ్లుగా ఎలాంటి సమాచారం లేకుండా పోయింది. కుటుంబీకులు, టీపీసీసీ రాష్ట్ర మహిళా నాయకురాలు అల్లూరి కృష్ణవేణి ప్రత్యేక చొరవతో శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్ వద్ద ప్రవాసీ ప్రజావాణిలో కేంద్రం ఇన్‌చార్జి అమరేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. గల్ఫ్ కార్మికుడి ఆచూకీ కనుగొని వెంటనే ఇండియాకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కుటుంబీకులతో కలిసి విన్నవించారు. కాంగ్రెస్ మహిళా నాయకురాలు రేఖాగౌడ్ తదితరులు ఉన్నారు.

ఇంట్లో చోరీ



సీసీ ఫుటేజీలో గుర్తుతెలియని వ్యక్తి

బాసర: మండలంలోని టాక్లి గ్రామంలోని గిరిజనవాడలో శుక్రవారం వేకువజామున దావనే గంగాధర్ ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. రూ.30 వేల నగదు, తులం బంగారం వస్తువులను ఎత్తుకెళ్లినట్లు బాధితుడు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. గంగాధర్ ఇంటి పక్కన ఉన్న జారీకొట్ బాబురావు ఇంటి ఆవరణలో సీసీ కెమెరాలో గుర్తుతెలియని వ్యక్తులు చిక్కారు. వీరిని గుర్తించే పనిలో పోలీసులు ఉన్నారు.

ఇన్‌స్టాగ్రామ్‌లో కత్తులతో పోస్టు

- మహిళపై కేసు

ఆదిలాబాద్‌రూరల్: ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా ఇన్‌స్టాగ్రామ్‌లో కత్తులతో పోస్టుచేసిన మహిళపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఆదిలాబాద్‌రూరల్ సీఐ ఫణీధర్ తెలిపారు. మావల పోలీసుస్టేషన్ పరిధిలోని కేఆర్‌కే కాలనీకి చెందిన పతంగె స్వప్న ఇన్‌స్టాగ్రామ్‌లో కత్తులతో పోస్టు చేయడంపై పోలీసులు సుమోటోగా తీసుకున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు.

లక్సెట్టిపేట వరకు జాతీయ రహదారి పొడిగించాలి

- జన్నారం మండల అభివృద్ధి కమిటీ నాయకులు
- ఎంపీ గోడం నగేశ్‌కు వినతి



ఎంపీ నగేశ్‌కు వినతిపత్రం అందిస్తున్న మండల అభివృద్ధి కమిటీ నాయకులు

జన్నారం: జాతీయ రహదారిని కడెం, జన్నారం, దండేపల్లి మీదుగా లక్సెట్టిపేట వరకు పొడిగించేలా చూడాలని జన్నారం మండల అభివృద్ధి కమిటీ నాయకులు కోరారు. శుక్రవారం ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ముంబయి నుంచి నిర్మల్ మీదుగా ఖానాపూర్ వరకు ఉన్న జాతీయ రహదారిని అటవీ అనుమతులు తీసుకుని కడెం, జన్నారం, దండేపల్లి మీదుగా లక్సెట్టిపేట వరకు పొడిగించాలని కోరినట్లు తెలిపారు. కేంద్ర రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఈనెల 5న ఆదిలాబాద్‌కు వస్తున్నారని, ఆయన దృష్టికి తీసుకెళ్లి మంజూరుకు కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారని పేర్కొన్నారు. లక్సెట్టిపేట నుంచి జన్నారం మీదుగా రహదారుల గుండా వాహనాల రాకపోకలపై అటవీశాఖ ఆంక్షలు ఎత్తివేసి, రాకపోకలను అనుమతించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా జన్నారంలో 30 పడకల ఆసుపత్రి మంజూరు చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ విన్నవించినట్లు తెలిపారు. జన్నారం అభివృద్ధి కమిటీ కన్వీనర్ శ్రీరాముల కొండయ్య, కో కన్వీనర్ కోడూరి చంద్రయ్య, బీసీ సంఘం అధ్యక్షులు గూడ అశోక్, పెరక సంఘం అధ్యక్షులు ఎంబడి సత్తన్నతోపాటు మేనేని శ్రీనివాస్ రావు, ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు షబ్బీర్ పాషా, మైనార్టీ నాయకులు షేక్ అక్బర్ పాల్గొన్నారు.

వీహబ్ ప్రతినిధులతో చర్చ



కార్యక్రమంలో పాల్గొన్న ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్

బాసర: విద్య, పరిశోధన, సాంకేతిక రంగాలతోపాటు మహిళలకు స్వయం ఉపాధి కోసం పరస్పర సహకారం అందించేందుకు బాసర ఆర్జీయూకేటీ, వీహబ్ మధ్య అవగాహన ఒప్పందం (ఎంవోయు)పై చర్చలు జరిగాయి. బాసర ఆర్జీయూకేటీలో శుక్రవారం ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్ సమక్షంలో వీహబ్ ప్రతినిధులు, ఓఎస్డీ, ఏవోలతో చర్చించారు. ఈ ఒప్పందం ద్వారా విద్య మౌలిక సదుపాయాలు, పరిశోధనకు ప్రోత్సాహం, శిక్షణలు, ఇంటర్న్‌షిప్‌లు, సంయుక్త ప్రాజెక్టులు వంటి అవకాశాలు మెరుగవుతాయని ఇన్‌చార్జి వీసీ తెలిపారు. హైదరాబాద్‌లో ఈనెల 15న సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్, వీహబ్ ప్రతినిధుల మధ్య అవగాహన ఒప్పందం జరగనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఫ్యాకల్టీ ఇన్‌చార్జి డాక్టర్ దిల్బార్, అసోసియేట్ డీన్, ప్లేస్మెంట్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

256 క్వింటాళ్ల జొన్నలు పట్టివేత



మాదపూర్‌లో జొన్నలు పట్టుకున్న పోలీసులు

ఇచ్చోడ: మండలంలోని మాదపూర్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన 256 క్వింటాళ్ల జొన్నలను ఎస్సై తిరుపతి ఆధ్వర్యంలో శుక్రవారం పట్టుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు మాదపూర్‌లో శివారులో సజ్జద్ రేకులషెడ్డులో తనిఖీ చేయగా నిల్వ ఉన్న జొన్నలు లభ్యమయ్యాయి. ఆర్ఐ హుస్సేన్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. పంచనామా నిర్వహించి అనుమానాస్పదంగా ఉన్న జొన్నలను సీజ్ చేసి వ్యవసాయ, మార్కెటింగ్ అధికారులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జొన్నలు తరలిస్తున్న ట్రాలీ వాహనం..

ఇంద్రవెల్లి: అక్రమంగా జొన్నలను ట్రాలీ వాహనంలో తరలిస్తుండగా మండలంలోని హీరాపూర్ చెక్‌పోస్టు వద్ద శుక్రవారం పట్టుకున్నట్లు వ్యవసాయ మార్కెట్, రెవెన్యూ అధికారులు తెలిపారు. తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఏఎంసీ కార్యదర్శి శ్రీనివాస్ కథనం ప్రకారం.. మండలంలోని ఏమాయికుంటకు చెందిన వ్యాపారి నారాయణ ట్రాలీలో జొన్నలు తరలిస్తున్నట్లు సమాచారం అందింది. చెక్‌పోస్ట్ వద్ద ట్రాలీ వాహనాన్ని తనిఖీ చేయగా ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న 45 క్వింటాళ్ల జొన్నలను సీజ్ చేశారు. ఆ జొన్నలను ప్రభుత్వ గోదాంలో భద్రపర్చగా, ట్రాలీ వాహనాన్ని పోలీసుస్టేషన్‌కు తరలించారు.